సాక్షి
చిత్తూరు
శనివారం । 23 । నవంబర్ । 2024



క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

విద్యతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందవోలు పిలుపునిచ్చారు. - 8లో



సైన్స్ మ్యూజియం పరిశీలన

చిత్తూరు నగరంలోని సైన్స్ మ్యూజియం ఆధునికీకరణ పనులను జిల్లా సమగ్ర శిక్ష డీఈ పరిశీలించారు. - 8లో



వరసిద్ధుడికి రూ.4.49 కోట్లు

కాణిపాకంలో నిర్వహించిన పలు వేలం పాటల్లో వరసిద్ధి వినాయకస్వామికి రూ.4.49 కోట్ల రాబడి వచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

డీపీఓ సుధాకర్‌రావు బాధ్యతల స్వీకరణ



చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా సుధాకర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా డ్వామా ఫైనాన్స్ ఆఫీసర్‌గా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో డీఎల్‌పీఓ పార్వతి డీపీఓగా అదనపు బాధ్యతలు చూసుకునేవారు. నూతన డీపీఓకు సిబ్బంది స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. గతంలో ఐరాల, వడమాలపేట, రేణిగుంట, వెదురుకుప్పంలో ఎంపీడీఓగా పనిచేసిన అనుభవం ఉందని ఆయన తెలిపారు.

జెడ్పీలో ఉద్యోగోన్నతులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాపరిషత్ పరిధిలో పలువురికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సీఈఓ రవికుమార్‌నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 10 మంది రికార్డు సహాయకులకు జూనియర్ సహాయకులుగా, నలుగురు అటెండర్లకు టైపిస్టులుగా, ఒక అటెండర్‌కు డ్రైవర్‌గా పదోన్నతి కల్పించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


త్వరలో ఇంటింటికీ సౌర విద్యుత్

కుప్పం: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ త్వరలో సౌర విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన రెస్కో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెస్కో సంస్థ పరిధిలో నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. త్వరలో సోలార్ సిస్టమ్ ద్వారా ప్రతి ఇంటికీ కనెక్షన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 వేల గృహాలకు సౌర విద్యుత్ కనెక్షన్ల కోసం సర్వే పూర్తి చేశామని, ఈ మేరకు సౌర విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. రెస్కోలో పనిచేసే సిబ్బంది సమష్టిగా పని చేసి, ప్రతి ఇల్లు సౌర విద్యుత్ కనెక్షన్ల తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఏఆర్ డీఎస్పీల నియామకం

చిత్తూరు అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్)లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో డీఎస్పీలను నియమిస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న బి.చిన్నికృష్ణను చిత్తూరుకు, ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న పి.చంద్రశేఖర్‌ను తిరుపతికి బదిలీ చేశారు.

ఐరాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 310 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు ఆ చుట్టుపక్కల సుమారు 10 గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. వినాయకపురం, చీటువారిపల్లె, ఐల కృష్ణారెడ్డివారిపల్లె నుంచి వస్తున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక, నడిచి వస్తున్నారు. ప్రస్తుత పాఠశాల వేళలలో దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు త్వరగా ఇళ్లకు చేరుకుంటున్నారు. పాఠశాలల సమయం సాయంత్రం 5 గంటల వరకు పెంచితే తమ బిడ్డలు ఇళ్లకు రావడానికి ఇబ్బంది పడతారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



చదువర్రీ

బడి పనివేళల పెంపుతో చిన్నారులు అధిక సమయం నాలుగు గోడలకే పరిమితం.. కాసింత సేపు కూడా ఆటపాటలకు దూరం.. వెరసి ఒత్తిడి.. మంకుపట్టు, పిరికితనం పెరుగుదల.. ఫలితం మరుగున పడనున్న నైపుణ్యాలు.. విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం.. మా బిడ్డల చదువెలా సాగాలని తల్లిదండ్రుల అంతర్మథనం.. ఇదీ పాఠశాల సమయం మార్పుతో కలగనున్న దుష్ప్రభావం అని విద్యావేత్తల అభిప్రాయం.

- పాఠశాలల సమయం మార్పు వద్దంటున్న టీచర్లు
- కూటమి సర్కారు నిర్ణయంపై వ్యతిరేకత
- నిర్ణయం మార్చుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వింత పోకడలకు తెరలేపుతోంది. తల్లికి వందనం హామీ ఇచ్చి అమలు చేయకుండా తల్లిదండ్రులను కూటమి సర్కారు మోసం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చడంలో వెనుకబడింది. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి, ఇంతవరకు నోటిఫికేషన్ జారీ చేయకుండా వెనుకడుగు వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాల్సిన కూటమి సర్కారు విద్యార్థులకు ఇబ్బందులు సృష్టించే వింత నిర్ణయాలు తీసుకుంటోంది. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల సమయం లేదని విద్యావేత్తలు అంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల సమయం పెంచేందుకు నిర్ణయం తీసుకుని, పైలెట్ ప్రాజెక్టుగా పలు పాఠశాలల్లో అమలు చేసేందుకు సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, టీచర్లు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

అనధికారికంగా అమలు

ఓ వైపు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాలు సమయం మార్పు విషయంపై వ్యతిరేకత తెలుపుతున్నా.. ప్రభుత్వం జీఓ విడుదల కాకముందే అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారు. అనధికారికంగా ఇప్పటికే పాఠశాలల సమయం మార్చివేశారు. శుక్రవారం రోజున అనధికారికంగా చిత్తూరు జిల్లాలోని పాలసముద్రం మండలం ఎస్‌ఆర్ కండ్రిగ, బైరెడ్డిపల్లె మండలంలోని బైరెడ్డిపల్లె బాలురు హైస్కూలు, వి.కోట మండలం జౌనిపల్లె, రామకుప్పం మండలంలోని రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాలల్లో సమయం మార్పును అమలు చేశారు. దీంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు.

నిర్ణయం మార్చుకోవాల్సిందే

కూటమి ప్రభుత్వం పాఠశాలల సమయం పెంపు విషయంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని కచ్చితంగా మార్చుకోవాల్సిందేనని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నిర్ణయంతో ఎలాంటి ఉపయోగం ఉండదంటున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోకుండా ఏకపక్షంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం తగదని హెచ్చరిస్తున్నాయి. చిత్తూరు జిల్లాకు సమీపంలో ఉన్న తమిళనాడులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.10 గంటల వరకు, కర్ణాటకలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తున్నారని టీచర్లు చెబుతున్నారు. తెలంగాణాలో సైతం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు వాపోతున్నారు. రాష్ట్రంలో మాత్రం కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకోకుండా సమయం మార్పులు చేయడంపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. సర్కారు నిర్ణయం మార్చుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

చిత్తూరు జిల్లా సమాచారం

గవర్నమెంట్ యాజమాన్యం పాఠశాలలు	15
జెడ్పీ హైస్కూల్స్ 291	మున్సిపల్ హైస్కూల్స్ 10
రెసిడెన్షియల్ 17	కస్తూర్బాగాంధీ విద్యాలయాలు 8
ఏపీ మోడల్ స్కూల్స్ 7	ప్రైవేట్ ఎయిడెడ్ 6
మొత్తం ఉన్నత పాఠశాలలు 354	మొత్తం విద్యార్థులు 90,122
హైస్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు	4,740

ఇప్పటికే 17,915 మంది గైర్హాజరు

చిత్తూరు జిల్లాలోని 32 మండలాల్లో ప్రభుత్వ యాజమాన్యం, జిల్లా పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్, కేజీబీవీ, ఏపీ మోడల్, ప్రైవేట్ ఎయిడెడ్ స్కూళ్లు మొత్తం కలిపి 354 పాఠశాలలున్నాయి. ఇందులో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 90,122 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఇప్పటికే 17,915 మంది విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు. అనేక కారణాలతో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం సమయం పెంచితే మరింత మంది విద్యార్థులు పాఠశాలలకు నిలిచిపోయే అవకాశాలున్నాయని టీచర్లు అభిప్రాయపడుతున్నారు.



చిత్తూరు డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు(ఫైల్)

గ్రామాల పరిస్థితులు తెలుసుకోవాలి



మారుమూల గ్రామాల నుంచి చాలా మంది విద్యార్థులు హైస్కూళ్లకు వస్తుంటారు. ఆ గ్రామాల నుంచి బస్సు సౌకర్యం ఉండదు. అలాంటి గ్రామాల విద్యార్థుల పరిస్థితులను ప్రభుత్వం తెలుసుకోవాలి. మారుమూల గ్రామాలు, వాతావరణ పరిస్థితులన్నీ ఆలోచించి, గతంలో పాఠశాలల సమయం నిర్ణయించారు. ఇప్పుడు మళ్లీ తొమ్మిది నుంచి 4 గంటల వరకు సవరించేందుకు ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదు.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కోశాధికారి, చిత్తూరు జిల్లా

పునరాలోచించాలి



ప్రస్తుత ప్రభుత్వం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల సమయం పెంచాలని ఆలోచించడం సరైన విధానం కాదు. దీనికి అనుగుణంగా పలు జిల్లాల్లో డీఈఓలు పైలెట్ ప్రాజెక్టుగా ఉత్తర్వులు ఇస్తున్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టు షెడ్యూల్‌లో ప్రార్థనకు 20 నిమిషాలు, భోజన విరామం ఒక గంట, మధ్యలో విరామం 15 నిమిషాలుగా పెట్టడం సహేతుకంగా లేదు. విద్యార్థులను అంత సమయం తరగతి గది నుంచి బయటకు పంపడంతో భద్రతాపరమైన ఇబ్బందులు ఏర్పడుతాయి.

– మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్టీయూ చిత్తూరు జిల్లా అధ్యక్షులు

ఇబ్బందులు తలెత్తుతాయి



నూతన సమయపాలనతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తుతాయి. క్షేత్రస్థాయిలో ఎలాంటి నిర్ణయాలు సేకరించకుండా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదు. ఏ ఇతర రాష్ట్రాల్లోనూ సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలను నిర్వహించడం లేదు. ఇక్కడ మాత్రం ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం ఎంత వరకు సబబు.? – మోహన్, ఎస్టీయూ,చిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శి

గుజ్జు పరిశ్రమ నుజ్జు!

రుచిలో మధురం.. వేసవి ప్రత్యేకం.. ఫలాల్లో రాజసం.. ఉద్యాన పంటలకే తలమానికం మామిడి. ఆహార ప్రియుల నోరూరించే మాధుర్యం ఉన్న ఈ పండు ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలు మాత్రం ఖాయిలా దశకు చేరే స్థితి నెలకొంది. యూరప్ దేశాల్లో యుద్ధం కారణంగా మామిడి గుజ్జు ఎగుమతి ఆగిపోయింది. పరిశ్రమల్లో నిల్వలు పేరుకుపోయాయి. ఫలితంగా అటు వ్యాపారులు.. ఇటు కర్షకులకు చేదు మిగలనుంది.

- జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమ కుదేలు
- గుజ్జు ఎగుమతి..లేక విలవిల
- యూరప్ దేశాల్లో యుద్ధం ఎఫెక్ట్
- పేరుకుపోయిన 2.75 లక్షల టన్నుల గుజ్జు నిల్వలు



జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సాగు

కాణిపాకం: మామిడి గుజ్జు పరిశ్రమలు కుదేలవుతోంది. ఎగుమతి లేక వ్యాపారులు విలవిలలాడుతున్నారు. యూరప్ దేశాల్లో యుద్ధం కారణంగా గుజ్జు ఎగుమతికి బ్రేక్ పడింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.75 లక్షల టన్నుల గుజ్జు పేరుకుపోయింది. దీనికితోడు వ్యాపారులను జీఎస్టీ వేధిస్తోంది. బ్యాంకు రుణాల గడువు ముంచుకొస్తోంది. అలాగే మామిడి సీజన్ సమీపిస్తుండడంతో ఫ్యాక్టరీ యజమానులు అయోమయంలో పడ్డారు. దీని ప్రభావం మామిడిసాగు రైతులపై పడనుంది.

జిల్లా మామిడికి పెట్టిన పేరు

జిల్లా మామిడి సాగుకు పెట్టింది పేరు. జిల్లాలోని మామిడి రుచి..నాణ్యత భేష్ అన్న మార్క్ ఉంది. ఈ క్రమంలో జిల్లాలోని పంట ఉత్పత్తుల కోసం స్థానిక మామిడి గుజ్జు పరిశ్రమల వ్యాపారులు, మామిడి వ్యాపారులతోపాటు తమిళనాడు, కర్ణాటకలోని ఫ్యాక్టరీ యజమానులు సైతం క్యూకడుతుంటారు. ఈ క్రమంలో మామిడి పంట దిగుబడితోపాటు గుజ్జు తయారీలో జిల్లా అగ్రస్థానంలో ఉంది. అయినా మామిడిని నమ్ముకున్న అన్నదాతకు లాభాల మాధుర్యం ఏటా దూరం అవుతోంది.

జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో మామిడి సాగు అవుతోంది. ఇందులో 65 శాతం పంట తోతాపురి రకం ఉంది. ఈ పంటపై సుమారు 80 వేల మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు.

యుద్ధంతో ఎగుమతికి బ్రేక్

ఈ ఏడాది తోతాపురి రకం కిలో రూ.30 వరకు పలికింది. బేనిషా, ఇతర రకాల పండ్లను పరిశ్రమల యజమానులు కిలో రూ.50 పైగా కొనుగోలు చేశారు. ఈ పండ్లను గుజ్జు తీశారు. ఇలా తయారు చేసిన మామిడి గుజ్జును అధికంగా యూరఫ్ దేశాలకే ఎగుమతి చేస్తారు. అలాగే కొంత మొత్తంలో గల్ఫ్‌కు కూడా ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం యూరప్ దేశాల్లో యుద్ధం కారణంగా గుజ్జు ఎగుమతి ఆగిపోయింది. మూడు నెలలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 47 పల్ప్ ఫ్యాక్టరీల్లో 2.75 లక్షల గుజ్జు నిల్వ ఉంది. దీని విలువ సుమారు రూ.1,750 కోట్లు ఉంటుందని అంచనా. దీని ప్రభావం రానున్న సీజన్‌పై పడనుంది. ఎగుమతి లేని కారణంగా పలు ఫ్యాక్టరీలు మూతపడే అవకాశం కనిపిస్తోంది. ఇదే జరిగితే వచ్చే సీజన్‌కు మామిడి పంట రోడ్డు పాలు కాక తప్పదని పరిశ్రమల యజమానులు, వ్యాపారులు, రైతులు దిగులు చెందుతున్నారు.

జిల్లా మామిడి సాగు, గుజ్జు వివరాలివీ

మామిడి సాగు విస్తీర్ణం 1.50 లక్షల ఎకరాలు	మామిడి రైతులు సంఖ్య 80 వేల మంది
పండ్ల గుజ్జు పరిశ్రమలు 47	ఈ ఏడాది గుజ్జు తయారీ 2.75 లక్షల టన్నులు
నిల్వ ఉన్న గుజ్జు విలువ 1,750 కోట్లు	గుజ్జు ఎగుమతి అయ్యే దేశాలు గల్ఫ్, యూరఫ్

భయం గుప్పెట్లో...

పరిశ్రమల యజమానులకు కష్టాల కడలి మొదలైంది. ప్రధానం మామిడి పండ్ల గుజ్జు అమ్ముడు పోతుందా?.. లేదా అనే అయోమయంలో పడ్డారు. ఫిబ్రవరి నెలాఖరుకు గుజ్జు ఎగుమతి కాని పక్షంలో ఢీలా పడేలా ఉన్నారు. దీనికి తోడు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలతో ఆర్థిక కష్టాలు మొదలవుతున్నాయంటూ పరిశ్రమ యజమానులు కంటతడి పెడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని పల్ప్ ఫ్యాక్టరీల యజమానులు కోరుతున్నారు. వారి డిమాండ్లు ఇలా ఉన్నాయి.

- ఆరు నెలల పాటు దీర్ఘకాలిక, తాత్కాలిక రుణాలు వర్కింగ్ క్యాపిటల్ లిమిట్స్ వాయిదా వేయాలి. వడ్డీకి రాయితీలిచ్చి ఆదుకోవాలి. జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలి.
- గుజ్జు పరిశ్రమలకు ఇవ్వాల్సిన రాయితీలను వెంటనే విడుదల చేయాలి.
- కరెంట్ ఫిక్స్‌డ్ చార్జీలను రద్దు చేయాలి.
- ఇన్ ల్యాండ్ కంటైనర్ డిపో మంజూరు చేయాలి.
- మామిడి గుజ్జు, జ్యూస్ ఎమ్మార్పీపై 12 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దాన్ని రద్దు చేయాలి.
- విదేశాల్లో దిగుమతి పన్ను 28 శాతం వసూలు చేస్తున్నారు. వీటిని తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి.
- మామిడి బోర్డు ఏర్పాటుతో పాటు ఆ బోర్డును కూడా జిల్లాకు కేటాయించాలి.

ప్రభుత్వాలే ఆదుకోవాలి



మామిడి గుజ్జు నిల్వలు పూర్తిగా నిలిచిపోయాయి. యూరఫ్ దేశాల్లో జరుగుతున్న యుద్ధం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతు లకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. పరిశ్రమల యజమానులను ప్రభుత్వాలే ఆదుకోవాలి.

–గోవర్ధన్ బాబి, జిల్లా పండ్ల, పరిశ్రమల సమాఖ్య కార్యదర్శి, చిత్తూరు

డిపో ఏర్పాటు చేయాలి



ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి దిగుబడితోపాటు గుజ్జు తయారీలో కూడా ముందంజలో ఉంది. ఇక్కడ గుజ్జుకు మంచి ఆదరణ ఉంది. అందుకే విదేశాల్లో కూడా దిగుమతి పన్ను అధికంగా ఉంది. ఈ పన్ను తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మామిడి డిపో ఏర్పాటు చేయాలి.

–షామీర్ షర్మ, పరిశ్రమ యజమాని

బాధేస్తోంది



ప్రస్తుతం ఎగుమతి పూర్తిగా నిలిచిపోయింది. యుద్ధ ప్రభావంతో గుజ్జు అమ్ముడు పోవడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి. మామిడి గుజ్జు, జ్యూస్‌కు జీఎస్టీ అంటే ఎగుమతి కష్టతరమవుతోంది. ప్రభుత్వాలు స్పందించి పరిశ్రమల యజమానులను ఆదుకోవాలి.

–రమేష్‌నాయుడు, పరిశ్రమ యజమాని

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని ఎంపీ, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అది కూడా జిల్లాకే కేటాయించేలా ప్రతిపాదనలు అందజేశాం. మామిడి రైతులను పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ముందుంది. –మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు

కొదమసింహాలై గర్జించాలి



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షులు కరుణాకరరెడ్డి

- ఫిబ్రవరి నుంచి జనంతోనే జగనన్న
- వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం
- భూమన కరుణాకర రెడ్డి



పలమనేరులో వైఎస్సార్‌సీపీ సర్వసభ్య సమావేశానికి హాజరైన నాయకులు

పలమనేరు/ గంగవరం: ఎన్నికలెప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కొదమసింహాలై గర్జించి, మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, జగనన్నను సీఎం చేసుకుందామని ఆ పార్టీ చిత్తూరు,తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పలమనేరు సమీపంలోని సాయినగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో స్థానిక పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అధ్యక్షతన కార్యకర్తల నియోజకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను మీలో ఒక్కనిగా జగనన్న నియమించిన సైనికునిలా పార్టీ బలోపేతం కోసం మీ సూచనలు, సలహాలతో పార్టీని ముందుకు తీసుకెళతానని చెప్పారు. గతంలో మనం చేసిన పొరబాట్లను సరిదిద్దుకుని వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు విలువలేని పార్టీలు మనుగడ సాగించినట్టు చరిత్రలో లేవని అందుకే మనం ఈ దఫా కార్యకర్తలకు పెద్దపీట వేయాలన్న సంకల్పంతో ముందుకెళతామన్నారు. మాట తప్పిన కూటమి ప్రభుత్వాన్ని కడిగేసేందుకు, ప్రజల పక్షాన జగనన్న వచ్చే ఫిబ్రవరి నుంచి జనంలోకి రానున్నారని తెలిపారు. 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేసి, 2.5 కోట్ల మందితో నేరుగా సంభాషించిన నేత జగన్‌మోహన్‌రెడ్డిని మినహా ప్రపంచంలో మరెవరూ లేరన్నారు. రాష్ట్రంలో 60 శాతం పేదలున్నందున పార్టీలు, కులాలతో సంబంధం లేకుండా అర్హులైన వారికి సంక్షేమాన్ని అందించాలనే తలంపుతో నాడు జగనన్న పథకాలు అందించారన్నారు. అదే ఆయన చేసిన తప్పా? అని ప్రశ్నించారు. శత్రువుకు కూడా మేలు చేయాలనే సంకల్పం ఆయనదని, కూటమినేతల లాంటి స్వార్థరాజకీయాలు ఆయనకు తెలివన్నారు. నాడు చంద్రబాబు ఓటమి చెందాక రెండున్నరేళ్లు జనంలోకి రాలేదని, కానీ జగనన్న జనం కోసం మూడునెలల్లోనే వచ్చాడన్నారు. 40 శాతం ఓట్లు వచ్చి, ఓటమి పాలైన పార్టీ ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. కేవలం కేంద్రంతో లాలూచీ పడి జగన్‌మోహన్‌రెడ్డిని ఓ భూతంలా చూపి, కొన్ని శక్తులంతా ఏకమై ఈవీఎలంను మార్చి, అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, తిప్పేస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీసీసీబీ మాజీ చైర్మన్ రెడ్డెమ్మ, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, మాజీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువు ఆక్రమణలు తొలగించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఐరాల మండలం కాణిపాకం పంచాయతీ పరిధిలోని అగరంపల్లి చెరువు ఆక్రమణలను తొలగించాలని కాణిపాకం చెరువు సాగునీటి సహకార సంఘం చైర్మన్ చరణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చెరువు సాగునీటి సహకార సంఘం నాయకులు, గ్రామస్తులు కలెక్టరేట్‌లో డీఆర్వో మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి, ఫిర్యాదు చేశారు. అనంతరం చరణ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాణిపాకం పంచాయతీ పరిధిలో 14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించి పంచాయతీకి అప్పజెప్పారన్నారు. అయితే కొంతమంది కబ్జాదారులు తమ భూమి అనుకుని ఉన్న ప్రభు త్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన డీఆర్వో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఐరాల తహసీల్దార్ మహేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం ఆయకట్టుదారులు ప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పట్టాభి రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి సురేంద్రరెడ్డి, రాజేంద్రారెడ్డి జయచంద్రారెడ్డి మాజీ సర్పంచ్ ఎల్ గోపీనాథ్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.4.49 కోట్ల ఆదాయం

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాలు, సేకరణల నిర్వహణ, షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి శుక్రవారం టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్ల ద్వారా ఆలయానికి రూ.4.49 కోట్లు ఆదాయం చేకూరింది. వాహన పూజ సామగ్రి అమ్మకానికి రూ.5.50 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.45.66 లక్షలు, నేతి దీపాల విక్రయం రూ.67,00,999, వినాయక సదన్ హోటల్ నిర్వహణకు రూ. 27 లక్షలు, చెవిముక్కు కుట్టుకు రూ.6.50 లక్షలు, మరగదాంబిక కల్యాణ మండపం వద్ద బంకు నిర్వహణకు రూ.63 వేలు, శివాలయం వద్ద షాపునకు రూ.6,30,900 వేలంపాటల్లో కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఇవన్నీ ఒక సంవత్సరం కాలం పాటు లైసెన్స్‌లు జారీ చేశారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లోని 24 షాపులకు బహిరంగం వేలం నిర్వహించగా రూ.2,03,60,899 ఆదాయం వచ్చింది. కాగా మొత్తం ఆలయానికి రూ.4.44 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు ఈఓ గురు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ధనంజయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

అప్రైజర్ చేతివాటం

కంచే చేను మేసిన చందాన ఓ అప్రైజర్ తాను పనిచేస్తున్న బ్యాంకుకే టోకరా వేశాడు. అప్రైజర్‌గా ఉన్న వెసులుబాటును ఉపయోగించుకుని తక్కువ నాణ్యత ఉన్న బంగారాన్ని బినామీ ఖాతాల్లో తాకట్టు పెట్టి రూ.40 లక్షలు రుణం పొందాడు. ఈ బాగోతం ఆడిటింగ్‌లో బయటపడింది. ఈ సంఘటన యాదమరి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ)లో కలకలం రేపింది.

- బినామీ ఖాతాలతో రూ.40 లక్షల రుణం!
- తక్కువ బంగారం తాకట్టు పెట్టిన వైనం
- ఆడిట్‌లో బయటపడ్డ బండారం
- యాదమరి యూనియన్ బ్యాంక్‌లో కలకలం
- అధికారులు ప్రశ్నించడంతో రుణం చెల్లించిన అప్రైజర్



యూనియన్ బ్యాంక్ వద్ద ఖాతాదారులు

యాదమరి(పూతలపట్టు): యాదమరి యుబిఐలో అప్రైజర్‌గా భాస్కరాచారి కమీషన్ ప్రాతిపదికన పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ నుంచి బ్యాంకులో ఆడిటింగ్ చేస్తున్నారు. అప్రైజర్ తన బంధువుల పేరిట తొమ్మిది బినామీ ఖాతాలతో నగలు తాకట్టు పెట్టి రూ.40లక్షలు తీసుకున్నట్టు తేలింది. పైగా తాకట్టు పెట్టిన నగల విలువ మొత్తంగా రూ.10లక్షల వరకు మాత్రమే అయితే అతడు మూడురెట్లు ఎక్కువగా పొందినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో మొత్తంగా 17 సార్లు అతను ఇలా బినామీ ఖాతాలతో రుణం పొందాడని తేలింది. దీనిపై ఆడిటింగ్ అధికారులు నిలదీయడంతో అప్రైజర్ తాను కుదువపెట్టి తీసుకున్న రూ.40 లక్షల రుణాన్ని చెల్లించేశాడు. ఆడిట్ పూర్తి కాకపోవడంతో అతనికి బ్యాంకు సిబ్బంది తనఖా పెట్టిన నగలను తిరిగి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో రుణం చెల్లించినా తన నగలను తిరిగి ఇవ్వలేదని భాస్కరాచారి కొందరిని వెంటబెట్టుకొని బ్యాంకు అధికారులను నిలదీశాడు. బ్యాంకులో తనఖా ఉన్న నగలన్నీ పరిశీలించాల్సి ఉందని, అంతవరకూ తిరిగి ఇవ్వలేమని స్పష్టం చేశారు. యుబిఐలో ఏదో గోల్‌మాల్ జరిగిందని ప్రచారంలోకి రావడంతో శుక్రవారం పెద్ద సంఖ్యలో ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరుకుని తమ నగల గురించి మేనేజర్ మురళిని నిలదీశారు. అప్రైజర్‌కు అంత రుణం ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు.

ఖాతాదారుల నగలు సురక్షితం



యూనియన్ బ్యాంక్‌లో సుమారు 4000 మందికి పైగా బంగారు నగలు తాకట్టు పెట్టి రుణాలు పొందారు. వాటి విలువ రూ.52కోట్లు. అప్రైజర్ భాస్కరాచారి 9 మంది నగల నాణ్యతను పరిశీలించి నాకు ఇచ్చిన నివేదిక ప్రకారమే నేను ఆ ఖాతాలకు రుణం మంజూరు చేశాను. ఆడిట్ అధికారుల పరిశీలనలో ఆ నగలు నాణ్యత తక్కువని, వాటి విలువ రూ.10లక్షలేనని, అయితే రూ.40లక్షలు రుణం తీసుకున్నట్టు ఆడిట్ అధికారులు గుర్తించారు. బినామీ ఖాతాలతో మోసగించినట్టు బండారం బయటపడడంతో భాస్కరాచారి బ్యాంక్ సిబ్బందికి ఆ నగదు ఇచ్చానని చెప్పడం ఎంతమాత్రమూ సరికాదు. ఆడిటింగ్ ముగిసినంతరం అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఖాతాదారుల నగలన్నీ సురక్షితంగా ఉన్నాయి. ఆందోళన చెందనవసరం లేదు.

-మురళి, మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాదమరి

కిశోర బాలికల్లో మానసిక ఒత్తిడి తగ్గించాలి


కిశోర బాలికలకు అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: కిశోర బాలికల్లో మానసిక ఒత్తిడిని తగ్గించాలని ఐసీడీఎస్ పీడీ హైమావతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కిశోర వికాసం జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ కిశోర బాలికలు శారీరకంగా మానసికంగా సమస్యలు ఎదుర్కొంటారన్నారు. కిశోర బాలికలకు సరైన అవగాహన అవసరమన్నారు. 11–18 ఏళ్ల మధ్య ఉన్న కిశోర బాలికలకు శారీరకంగా మార్పులు సంభవిస్తాయని చెప్పారు. రుతుక్రమం ప్రారంభం కావడం, శారీరకంగా వచ్చే మార్పులపై అవగాహన లేకపోవడంతో మానసిక ఒత్తిడి పెరుగుతుందన్నారు. బాలికలు తమ సమస్యలను తల్లిదండ్రులకు వ్యక్తపరచడానికి సంకోచిస్తారన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో బాలికలకు శారీరకంగా సంభవించే మార్పులు, సమాజంలో మెలగాల్సిన తీరుతెన్నులపై అవగాహన కల్పించాలన్నారు. సమతుల ఆహారం కచ్చితంగా తీసు కోవాలన్నారు. సంబంధిత శాఖల సిబ్బంది గ్రామాల్లోని అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంకు శిక్షణ ఇచ్చి, మండలాల్లో ఉన్న కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి మాట్లాడుతూ కిశోర బాలికలకు ఆరోగ్య సంరక్షణ చాలా అవసరమన్నారు. మన దేశంలో దాదాపు 50 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు.

జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బాలికలకు విద్య అందిస్తే భవిష్యత్తులో సమాజంలో ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. విద్యతో బాహ్య ప్రపంచం అర్థమవుతుందన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగ సౌజన్య మాట్లాడుతూ ఆకతాయిలు, ఇతర వేధింపులు ఎదురైతే బాలికలు మహిళా సేఫ్టీ యాప్‌లో ఫిర్యాదు చేస్తే రక్షణ కల్పిస్తామన్నారు. అనంతరం కిశోర బాలికలకు అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి

చిత్తూరు కలెక్టరేట్: అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. నూతనంగా జిల్లాకు విచ్చేసిన జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, మెప్మా పీడీ రవీంద్ర శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఆదేశించారు.


కలెక్టర్‌ను కలిసిన జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు

వీఆర్వోకు దేహశుద్ధి

రామకుప్పం: ప్రేమ పేరుతో సాటి వీఆర్వోను నమ్మించి పెళ్లి చేసుకోకుండా కాలయాపన చేస్తున్న మరో వీఆర్వోకు ఆమె బంధువులు దేహశుద్ధి చేసిన ఘటన శుక్రవారం రామకుప్పం మండలంలో జరిగింది. బాధితురాలి బంధువుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లాకు చెందిన శ్రవణ్ రామకుప్పం మండలంలోని కొంగనపల్లి వీఆర్వోగా పనిచేస్తున్నాడు. అదే మండలంలోని మరో పంచాయతీ వీఆర్వోగా పనిచేస్తున్న యువతిని మూడేళ్ల ప్రేమించాడు. శ్రవణ్ ఆ యువతిని వివాహం చేసుకుంటానని చెప్పి ప్రేమాయణం సాగించాడు. ఈ క్రమంలో తనను వివాహం చేసుకోవాలని ఆ యువతి, శ్రవణ్‌ను కోరగా కాలయాపన చేస్తూ వచ్చాడు. అంతేగాక అతని ప్రవర్తనలో మార్పును గమనించిన ఆమె జరిగిన విషయాన్ని బంధువుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో బంధువులతో పాటు యువతి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న శ్రవణ్‌ను నిలదీసింది. అతని నుండి పెళ్లి విషయమై సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహించిన యువతి బంధువులు అతనికి దేహశుద్ధి చేశారు. అనంతరం వారు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. శ్రవణ్ పోలీసులకు అందుబాటులోకి రాకపోవడంతో శనివారం స్థానిక తహసీల్దార్‌తో చర్చించి వీఆర్వోకు న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు యువతి బంధువులకు చెప్పారు.

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

- రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం
- జెండాను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ మణికంఠ

తవణంపల్లె: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. శుక్రవారం మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీ పాఠశాల విద్య, జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికలు సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, వందన సమర్పణ చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం చేకూరుతుందన్నారు. క్రీడల్లో టీమ్‌వర్క్, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తుందన్నారు. క్రీడల్లో గెలుపు కోసం అన్ని జట్లు పోటీపడినప్పటికీ విజయం సాధించేది ఒకే జట్టు అన్నారు. ఓటమి పాలైన జట్లు నిరుత్సాహపడకుండా మరోసారి విజయం సాధించే దిశగా నిలవాలన్నారు. అనంతరం రాష్ట్రంలోని 13 జిల్లా నుంచి వచ్చిన బాలబాలికలు జట్లను పరిచయం చేసుకుని, మార్చ్ నిర్వహించిన క్రీడాకారులకు వందనం చేశారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, డీవైఈఓ చంద్రశేఖర్, డీఎస్‌డీఓ బాలాజీ, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, అరగొండ సర్పంచ్ మల్లుదొరై, ఉమామహేశ్వరరెడ్డి, హెచ్‌ఎంలు భువనేశ్వరి, మోహన్‌రెడ్డి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి వసంతవాణి, టోర్నమెంట్ ఆర్గనైజర్ కృష్ణ, పీడీలు రవీంద్రరెడ్డి, సిరాజ్, శ్రీనివాసులు, అరుణకుమార్, ఢిల్లీరాణి, అరుణ, గురుప్రసాద్, శాంతమ్మ, ఉమాపతి, నూరుద్దీన్, ఎంపీటీసీ ఇంద్రాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ

విజేతలు వీరే..

- రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో మొదటి రోజు బాలుర జట్లలో ప్రకాశం జిల్లాపై శ్రీకాకుళం జట్టు గెలుపొందింది. కృష్ణా జిల్లా జట్టుతో పోరాడి వైఎస్సార్ కడప జిల్లా జట్టు విజయం సాధించింది. విశాఖపట్నం జట్టుపై చిత్తూరు జట్టు గెలిచింది. ప్రకాశం జిల్లా జట్టుపై వైఎస్సార్ కడప జట్టు విజయం సాధించింది.
- **బాలికల జట్లు:** శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టుపై గుంటూరు జట్టు విజయం సాధించింది. పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా బాలికల జట్టు గెలిచి, పట్టు సాధించింది.

పేరు ఇళ్లకు.. తరలింపు కర్ణాటకకు..


కర్ణాటక సమీపంలోని పలమనేరు మండలం రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ఇసుక డంపు

పలమనేరు: కొందరు అక్రమార్కులు కౌండిన్య నది నుంచి ఇళ్ల నిర్మాణాల పేరుతో ఇసుకను ట్రాక్టర్లలో కర్ణాటకకు తరలిస్తున్నారు. ఎక్కడో ఇసుక డంపులు పెట్టుకుంటే కన్నడ ఇసుక వ్యాపారులు తాము రావడంలేదని తేల్చి చెప్పేశారు. దీంతో ట్రెండ్ మార్చిన ఇక్కడి ఇసుకాసురులు కౌండిన్య నుంచి నిత్యం తోడే ఇసుకను పట్టపగలే కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో దించేస్తున్నారు. అపై అక్కడి నుంచి లొకేషన్ ఆధారంగా ఇసుకాసురులు స్పాట్‌కు వెళ్లకున్నా ఇసుక కర్ణాటకకు చేరుతోంది. అక్కడి స్మగర్లు సంబంధిత లొకేషన్‌కు వెళ్లి టిప్పర్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండా తీసుకెళుతున్నారు.

ఎక్కడెక్కడంటే.. : కౌండిన్య నది నుంచి పలమనేరు రూరల్ మండలంలోని ముసలిమొడుగు, కృష్ణాపురం, సముద్రపల్లి, పెంగరగుంట, కూర్మాయి, జల్లిపేట, క్యాటిల్‌ఫామ్, గంగవరం మండలంలోని కూర్నిపల్లి, ఉయ్యాలమిట్ట, కలగటూరు, దండపల్లి, మబ్బువాళ్లపేట, పెద్దపంజాణి మండలంలో బొమ్మరాజుపల్లి, ముదరంపల్లి, గోనుమాకులపల్లి, చామనేరు, శివాడి, నిడిగుంటల నుంచి సమీపంలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో రహస్యంగా ఇసుక డంపులను నిల్వ చేస్తున్నట్టు సమాచారం.

ఎవరినడిగినా ఇంటి నిర్మాణాకని... : కౌండిన్యలో ఇసుకను తోడుతున్న ఎవరిని అడిగినా ఇంటి నిర్మాణానికని చెబుతున్నారు. నిత్యం కౌండిన్య నది పరిధిలో మూడు మండలాల్లోని 30 గ్రామాల్లో రోజుకు 300 లోడ్ల ఇసుక తరలుతుంటే ఈ ప్రాంతంలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయో? ఓసారి అర్థం చేసుకోవచ్చు. కర్ణాటకలో టిప్పర్ ఇసుక రూ.25 వేల నుంచి రూ.30 వేలు పలుకుతుండడంత యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఇసుక ఉచితం కాబట్టే పట్టుకోవడం లేదని, పాపం ఇళ్ల నిర్మాణాలకు తీసుకెళుతున్నారని భావించి మాట్లాడడం కొసమెరుపు.

మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

మదనపల్లె : తండ్రి మరణానికి కారకుడనే నెపంతో మామను హత్య చేసిన అల్లుడికి జీవితఖైదు విధిస్తూ మదనపల్లె రెండో అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి అబ్రహాం తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా సోమల మండలం నెల్లిమంద గొల్లపల్లెకు చెందిన వెంకటసిద్ధులు(63) అనే వ్యక్తి 2017 ఆగస్టు 7వ తేదీన కలికిరి మండలం గుట్టపాళెం గొల్లపల్లె పొలాల వద్ద దారుణ హత్యకు గురయ్యాడు. హత్య విషయమై వెంకటసిద్ధులు కుమారుడు నాగరాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమల ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. విచారణ బాధ్యతను అప్పటి చౌడేపల్లె సీఐ రవీంద్రకు అప్పగించారు. పోలీసు విచారణలో వెంకటసిద్ధులు అల్లుడు పి.సుధాకర(45)ను నిందితుడిగా గుర్తించారు. సుధాకర్ తండ్రి రెడ్డెప్ప మరణానికి మామ వెంకటసిద్ధులు చేయించిన చేతబడులు, క్షుద్రపూజలే కారణమని భావించి కక్ష పెంచుకుని, హత్య చేసేందుకు నిర్ణయించుకున్నాడు. గుట్టపాళెంలో జరిగే పాలేటమ్మ జాతరకు మామ వెంకటసిద్ధులును రావాల్సిందిగా కోరాడు. జాతరకు వచ్చిన మామను, పథకం ప్రకారం వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లి హత్య చేశాడు. పోలీసు విచారణలో అల్లుడు మామను హత్యచేసినట్లుగా నిర్ధారణ కావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఏడేళ్లపాటు కేసు విచారణ మదనపల్లె రెండో అదనపు జిల్లా కోర్టులో జరిగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం జడ్జి అబ్రహాం తీర్పు చెప్పారు. కేసులో ఏపీపీ జయనారాయణరెడ్డి వాదించగా, లైజనింగ్ ఆఫీసర్‌గా మోహన్‌రెడ్డి వ్యవహరించారు.

వ్యక్తి అరెస్టు


అరెస్టు చూపుతున్న డీఎస్పీ,సీఐ

వి.కోట: ఒక మహిళను మోసగించిన వ్యక్తిని శుక్రవారం వి.కోట పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు.. మండలంలోని బోయచిన్నాగనపల్లి పంచాయతీ రామనాథపురంలో నివాసం ఉంటున్న ఎస్టీ కులానికి చెందిన ఒక మహిళను అదే గ్రామానికి చెందిన సతీష్ అలియాస్ దినేష్ అనే వ్యక్తి ప్రేమించాడు. ఆ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వాంఛలు తీర్చుకున్నాడు. తర్వాత ఆ మహిళకు తెలియకుండా మరో మహిళను వివాహం చేసుకుని ఎస్టీ మహిళను మోసగించాడు. దీనిపై కేసు నమోదు చేసి సతీష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులతో పోలీసులు

తిరుపతి క్రైమ్: ఒడిశా నుంచి తిరుపతి మీదుగా చెన్నైకి తరలిస్తున్న 22 కిలోల గంజాయిని సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేసినట్టు తిరుపతి డీఎస్పీ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా పాత తిరుచానూరులోని ఓ హోటల్ వద్ద తిరుగుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వారు చిత్తూరు జిల్లాలోని కుప్పం, నగరి ప్రాంతాలకు చెందిన సాతుపాటి లోకేశ్వరరావు, కుమారిగా గుర్తించామన్నారు. వారిద్దరూ కలిసి గంజాయి అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఒడిశా నుంచి గంజాయిని పెద్ద మొత్తంలో తీసుకొచ్చి తిరుపతి పరిసరాలతో పాటు చెన్నైలో చిన్న చిన్న పొట్లాలు చేసి యువతకు అమ్మేవారని తెలిపారు. వీరి వద్ద నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గంజాయి విక్రయిస్తూ వీరు ఇరువురూ ఈస్ట్ పోలీస్ స్టేషన్లో పట్టుబడ్డారన్నారు. అప్పుడు చిత్తూరు జైలు రిమాండ్ ఖైదీలుగా ఉండి బయటకు వచ్చిన అనంతరం తిరిగి పుత్తూరు, తమిళనాడు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. వీరిపై రైల్వే పోలీస్ స్టేషన్లో కూడా అక్రమంగా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు కేసులు ఉన్నాయని తెలిపారు.

పెండింగ్‌లో 5వేల వ్యవసాయ సర్వీసులు

- త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్స్ విడతల వారీ అందజేస్తాం
- పైలట్ ప్రాజెక్టుగా కుప్పంలో సోలార్ సిస్టం
- డిస్కం సీఎండీ సంతోషరావు వెల్లడి


రూరల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయ విద్యుత్ పరికరాల కొరత ఉందని, త్వరలో పరికరాలు వస్తాయని డిస్కం (రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) సీఎండీ సంతోషరావు చెప్పారు. శుక్రవారం ఆయన ఎస్ఈ కార్యాలయంలో ట్రాన్స్‌కో అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో (మొత్తం 14 నియోజకవర్గాలు) 5 వేలకు పైగా వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్స్ విడతల వారీగా అందజేస్తామన్నారు. జిల్లాలోని కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని 'పీఎం సూర్య ఘర్' పథకం కింద మొత్తం 50 వేల సర్వీసులకు సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్టు వెల్లడించారు. వీటితో పాటు ప్రభుత్వ సర్వీసులకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు బిగించామని, ప్రభుత్వ, ప్రైవేటు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు కానున్న రూరల్ కార్యాలయాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాకు ఎస్ఈ కార్యాలయం కేటా యించడంతో రూరల్ కార్యాలయం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారు. రూరల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీజీఎం అయూబ్‌ఖాన్, ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు సురేష్, మునిచంద్ర, జగదీష్, వాసుదేవరెడ్డి, డీఈలు ప్రసాద్, ఆనంద్, రమేష్ పాల్గొన్నారు.

సైన్సు మ్యూజియం పనుల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని జింకల పార్కు వద్ద ఉన్న సైన్సు మ్యూజియం ఆధునికీకరణ పనులను శుక్రవారం జిల్లా సమగ్ర శిక్ష శాఖ ఇంజినీరింగ్ విభాగం డీఈ మధుసూదన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.12 లక్షలతో సైన్సు మ్యూజియం ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని జిల్లా సైన్సు అధికారి వెంకటరమణను ఆదేశించారు.

'జాతీయ బలరంగ్'కు దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో నిర్వహించే జాతీయ బలరంగ్ పండుగ పోటీలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్‌రాజు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషన్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ, ఇందిరాగాంధీ మానవ సంగ్రహాలయ, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 21, 22 తేదీల్లో భోపాల్ నంది జాతీయ బలరంగ్ పండుగ-2024 పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు దేశంలోనే వివిధ రాష్ట్రాల నుంచి జానపద, నృత్య కళారీతులపై పోటీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక కోసం ఈ నెల 29వ తేదీన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే చిత్తూరు జిల్లా జట్టు ఎంపిక కోసం ఈ నెల 25, 26 తేదీల్లో డైట్‌లో పోటీలు నిర్వహించనున్నామని, క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు 24వ తేదీలోగా డైట్ కళాశాలలో 94407 57761 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిబంధనలివీ...

- పోటీల్లో అభ్యర్థులు జట్లుగా మాత్రమే పాల్గొనాలి. వ్యక్తిగత ఎంట్రీలకు అనుమతి లేదు.
- ప్రతి జట్టులోను గరిష్టంగా 15 మంది సభ్యులు, వారితోపాటు ఒక గైడ్‌కు అనుమతి ఉంటుంది.
- చిత్తూరు జిల్లాకు ప్రత్యేకమైన జానపద నృత్యాలను ప్రదర్శించే జట్లకు మాత్రమే పోటీలో పాల్గొనే అర్హత ఉంది.
- జానపద నృత్యం చేసే జట్టు సభ్యులు పాటలు, సంగీతం అప్పటికప్పుడు నేరుగా ప్రదర్శించాలి.
- పోటీలో పాల్గొనే జట్లకు రవాణా భత్యం చెల్లించరు.
- జట్లు ప్రదర్శించ బోయే జానపద నృత్యం వివరాలను ఒక పేజీలో సమర్పించాలి.
- నైపుణ్యం ఆధారంగా ఒక జట్టును రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు.
- గత సంవత్సరం రాష్ట్రస్థాయి జాతీయ బలరంగ్ పోటీలకు ఎంపికైన జట్లకు ఈ ఏడాది పోటీల్లో అనుమతి ఉండదు.
- జట్లు వాద్య, సంగీత పరికరాలు, దుస్తులు తదితరాలు సొంతంగా ఏర్పాటు చేసుకోవాలి.